
7

సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024

మహాగణపతి.. మనసాస్మరామి



వెంకంపేటలో రుద్రాక్షలతో వినాయకుడు





రాజన్న ఆలయంలో కొలువుదీరిన గణనాథుడు



గీతానగర్-విద్యానగర్ అభివృద్ధి కమిటీ గణనాథుడు



రాంభగీచ మండపంలో పూజలు చేసిన ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో నిర్వాహకులు

సిరిసిల్ల/వేములవాడ/సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోనే సుమారు 800 వరకు వినాయక మండపాలు వెలిశాయి. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మట్టివినాయకుడికి ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేటలోని మార్గం ఫంక్షన్‌హాల్ ఎదుట రుద్రాక్షలతో వినాయకుడు కొలువుదీరాడు. స్థానికులు 6వేల రుద్రాక్షలతో తయారుచేసిన గణపతి ప్రతిమను ఏర్పాటు చేశారు. రాజన్న సన్నిధిలో గణేశ్ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అఖండ దీపారాధన, సిద్ధిబుద్ధి వినాయక ప్రతిష్ఠ చేశారు. ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'వర్కర్ టు ఓనర్' అమలు చేయాలి

- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్



నేతన్నల సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: నేతకార్మికులకు 'ప్రభుత్వం వర్కర్ టు ఓనర్' పథకాన్ని వెంటనే అమలు చేయాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. నేతకార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సిరిసిల్లలోని బీవైనగర్, చంద్రంపేట ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేపట్టి మాట్లాడారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగే చేనేత సమావేశంలో సీఎంకు కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. గుండు రమేశ్, కుమ్మరికుంట కిషన్, సిరిమల్ల సత్యం, నక్క దేవదాసు, ఒగ్గు గణేశ్, సురేశ్, రమేశ్, శేఖర్, అజయ్ ఉన్నారు.

ఆశ కార్యకర్తలను రెగ్యులరైజ్ చేయాలి

- ఆశవర్కర్స్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధవి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఆశవర్కర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ ఆశవర్కర్స్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి కోరారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఆశవర్కర్ల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, పరిష్కారమార్గాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేని మంజుల, నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, జయశీల, భారతి, కస్తూరి, గాయత్రి, రుచిత, గీత, చంద్రకళ, లత, భూలక్ష్మి, జమున పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



ఎల్‌ఎండీకి వెళ్తున్న నీరు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి 19,900 క్యూసెక్కులు, అనంతగిరి ప్యాకేజీ–10లోకి 6,400 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరదకాల్వ మీదుగా 9,500, మరో 560 క్యూసెక్కుల మేర వరద వస్తోంది. మిడ్‌మానేరులో 23.668 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

పట్టుదలతో శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్

- విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ



సిరిసిల్ల గ్రంథాలయంలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సిరిసిల్ల: నిరుద్యోగ అభ్యర్థులు పట్టుదలతో శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. సిరిసిల్లలోని సినారె జిల్లా గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులకు గ్రూప్స్ పరీక్షలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రసన్నహరికృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో చదివితే విజయం సాధిస్తారని తెలిపారు. ఆందోళన, నిరుత్సాహం చెందకుండా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. పోటీని చూసి భయపడొద్దని, పట్టుదలగా చదివితే ఉద్యోగాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. సిరిసిల్ల గ్రంథాలయానికి వచ్చే 300 మంది అభ్యర్థులకు సుమారు రూ.90వేల విలువైన కరెంట్ ఎఫైర్స్ బుక్స్‌ను పంపిణీ చేశారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ మానుక సత్యనారాయణ, సిరిసిల్ల కోర్టు సూపరింటెండెంట్ ఇట్టబోయిన వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చందు, రాజేశ్, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో విప్, కలెక్టర్





వేములవాడ: రాజన్నను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని వినాయకుడికి పూజలు చేశారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



వేములవాడ: రాజన్న ఆలయంలో భక్తులకు నిరంతరం అన్నదానం అందించే ప్రక్రియకు వేములవాడకు చెందిన గోలి సరిత–తిరుపతి దంపతులు ఆదివారం నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.4.50 లక్షల విరాళం అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ సూచనలతో విరాళం అందజేసినట్లు దాతలు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, నాయకులు కూరగాయల కొమురయ్య, సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, సంగ స్వామి, కనికరపు రాకేశ్, తోట రాజు, దాడి మల్లేశం, కూరగాయల శ్రీధర్, కూరగాయల సుప్రియ, ఆలయ పర్యవేక్షకులు వరి నర్సయ్య ఉన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

- భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తాం
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ విస్తరణ
- శృంగేరి పీఠాధిపతుల సూచనలు, సలహా మేరకు ముందుకెళ్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆలయ విస్తరణ పనులపై చర్చిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్న ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తామని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చైర్మన్ చాంబర్‌లో శనివారం ఆలయ నమూనాలు పరిశీలించి, అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులతో కలిసి సమీక్షించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవక్షేత్రంగా, దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి భక్తులకు స్వామివారి దర్శనం వేగంగా కల్పించేందుకు, మెరుగైన వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆహ్లాదకర వాతావరణం కల్పనకు చర్యలు తీసుకుంటామని, శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు ఆలయ విస్తరణ చేపడతామన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.

జీవో 149 రద్దుపై చర్చ

గత ప్రభుత్వ హయాంలో రాజన్న ఆలయ పరిసరాల్లో నూతనంగా 1000 మీటర్ల(కిలో మీటర్) పరిధిలో చేపట్టబోయే నిర్మాణాలపై ఇచ్చిన జీవో 149 రద్దుపై చర్చించారు. ఈ జీవోతో పట్టణంలో ఆలయ పరిసరాల్లో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. జీవో నంబర్ 149 రద్దుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డీఈ రఘునందన్, ఏఈవోలు బి.శ్రీనివాస్, రమేశ్‌బాబు, ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేశ్, ప్రధానార్చకులు సురేశ్, ఉపప్రధానార్చకులు శరత్, ఏఈ రాంకిషన్‌రావు తదితరులున్నారు.

గుట్టను పట్టాచేసుకున్న పట్వారీ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి గ్రామస్తులకు తెలియకుండా గుట్టుగా ఏకంగా గుట్టనే పట్టా చేసుకున్నాడు. అతని నుంచి కొనుగోలు చేశామంటూ కొందరు వ్యక్తులు గుట్టను చదునుచేస్తున్నారని తెలుసుకొని ఆదివారం ఆందోళనకు దిగారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం శివంగాలపల్లిలో గతంలో పట్వారీగా పనిచేసిన బాలకిష్టారాయుడు గ్రామ శివారులోని సర్వేనంబర్ 17లోని కుమ్మరిగుట్టపై 4 ఎకరాల భూమిని తన పేరిట పట్టా చేసుకున్నాడు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు అతని వారసులకు వస్తున్న రైతుబంధును నిలిపివేయించారు. అయితే ఈ భూమిని కొనుగోలు చేశామంటూ కొందరు వ్యక్తులు గుట్టను చదును చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ఈ భూమి తమది కాదని చెబుతున్నారు. దీంతో గ్రామస్తులు ఆదివారం ఆ గుట్ట వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే కోనరావుపేటలో సోమవారం ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



శివంగాలపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాజకీయ చైతన్యమే లక్ష్యం

- పద్మశాలి సమాజానికి పోపా దిక్సూచి కావాలి
- పోపా వేదికగా పద్మశాలి ప్రముఖుల మనోగతం
- ప్రతిభావంతుల సత్కార సభలో పద్మశాలి వక్తలు



సన్మాన గ్రహీతలతో సంఘం ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: పద్మశాలీ సమాజంలో రాజకీయ చైతన్యాన్ని పెంచి అధికార సాధనే లక్ష్యంగా ముందుకెళ్లాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ భవనంలో ఆదివారం పోపా ఆధ్వర్యంలో ప్రతిభావంతులను సత్కరించారు. పోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆడెపు శ్రీనివాస్, రిటైర్డ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దాసరి నాగేశ్వర్ తదితరులు హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా రాణిస్తున్న పద్మశాలీ సమాజంలో రాజకీయ చైతన్యం లేకపోవడం శోచనీయమన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పద్మశాలీ సామాజిక వర్గం నేతలను ఎన్నుకోవాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లోని ప్రతిభావంతులను పోపా సత్కరించింది. ఎంఈవో రఘుపతి, గాజుల ప్రతాప్, పోపా కార్యదర్శి పున్నం చందర్, ఉపాధ్యక్షులు మామిడాల భూపతి, గెంట్యాల భూమేశ్, మచ్చ ఆనందం, ఆడెపు వేణు, రాంప్రసాద్, వాసాల హరిప్రసాద్, బొల్లి భగవాన్, సదానందం, నాగుల శ్రీనివాస్, కనుకుంట్ల మధు, ఆడెపు చక్రపాణి, చేరాల ప్రభాకర్, సుమారు 100 మంది పోపా సభ్యులు పాల్గొన్నారు.

దారంతో అద్భుతకళ



పవన్‌కళ్యాణ్ చిత్రంతో సంతోష్

సిరిసిల్లటౌన్: నేతబతుకుల జీవనా'దారం'తో ఓ యువకుడు అద్భుతకళను ప్రదర్శిస్తున్నాడు. నిరుపేద నేత కుటుంబంలో పుట్టినా చిత్రకారుడిగా రాణించాలని కలలు గన్నాడు. తనకు నచ్చిన కళలో సరికొత్తదనాన్ని ప్రదర్శిస్తూ త్రెడ్(స్ట్రింగ్) ఆర్ట్‌తో అబ్బురపరుస్తున్నాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మద్దె సంతోష్ పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం సెకండియర్ చదువుతున్నాడు. తండ్రి గణేశ్ చాలా రోజుల క్రితమే అనారోగ్యంతో చనిపోగా తల్లి లక్ష్మి బీడీలు చేస్తూ ఇద్దరు కొడుకులు సంతోష్, విజయ్‌లను చదివిస్తుంది. కేసీఆర్ నగర్‌లో నివసించే సంతోష్ చిన్నతనం నుంచే చిత్రకళలో రాణిస్తున్నాడు. పెన్సిల్ చిత్రకళపై మక్కువ ఉంది. తన ప్రతిభకు సరికొత్త రీతిలో గుర్తింపు రావాలనుకున్నాడు. తనకు ఇష్టమైన సినీనటుడు పవన్‌కళ్యాణ్ చిత్రపటాన్ని దారంతో వేశాడు. వైట్‌బోర్డుపై 280 మొలలు అమర్చి ఆరు వేల చుట్లుతో 7వేల మీటర్ల దారం ఉపయోగించి పవన్‌కళ్యాన్ చిత్రాన్ని ఆవిష్కరించాడు. అద్భుతమైన కళను ప్రదర్శించిన సంతోష్‌ను చిత్రకారులు అభినందిస్తున్నారు.

నిషేధం తొలగేదెప్పుడో?

'సిరిసిల్లకు చెందిన ఓ మహిళా రైతుకు సర్వేనంబర్ 72లో మూడెకరాలస్థలం ఉంది. 50 ఏళ్ల క్రితం కొనుగోలు చేయగా సబ్‌రిజిస్ట్రార్ వద్ద రిజిస్ట్రేషన్ అయ్యింది. పక్కనే గల సర్వేనంబర్ 71లో మున్సిపల్‌కు సంబంధించిన స్థలం ఉందని సదరు సర్వేనంబర్‌ను సీజ్ చేశారు. ధరణిలో దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ విచారించి ఎన్‌వోసీ ఇచ్చారు. దరఖాస్తును కలెక్టర్‌కు లాగిన్ చేయగా.. రిజెక్టు చేశారు.' కారణాలు మాత్రం తెలుపలేదు.



సిరిసిల్ల శివారులోని భూమి

- ఇక్కడ కరెక్ట్...అక్కడ రిజెక్ట్
- ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో పలు సర్వేనంబర్లు
- అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బందుల్లో రైతులు
- నిషేధాన్ని తొలగించాలని డిమాండ్



ధరణి పోర్టల్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ స్థలాలు కాపాడేందుకు సంధించిన నిషేధాస్త్రం పట్టాభూమిదారులకు సంకటంగా మారింది. ఏళ్లుగా డాక్యుమెంట్లు, పాస్‌బుక్కులు ఉన్నా యాజమాన్య హక్కులు పొందలేకపోతున్నారు. అవసరాలకు అమ్ముకోలేకపోతున్నారు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పలువురు రైతులు ధరణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ల నుంచి క్లియరెన్స్ కోసం నివేదికను పొందినా కలెక్టరేట్ నుంచి రిజెక్టు చేయడం బాధితుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. దీనిపై 'సాక్షి' ఫోకస్.

ప్రభుత్వ స్థలాలు కాపాడేలా..

ప్రభుత్వ భూములు పరాధీనం కాకూడదనే ఉద్దేశంతో జిల్లాలోని పలు సర్వేనంబర్లను ప్రొహిబిటెడ్(నిషేధం) భూమిగా ధరణిలో నమోదు చేశారు. కొన్నింటిని క్షేత్రస్థాయి అధికారులు పెండింగ్‌లో ఉంచగా.. మరికొన్ని కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలు, మాజీ సైనికులు, జంగ్ సిపాయి, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన భూములు అమ్ముకోకుండా ఉండేందుకు నిషేధాన్ని అమలు చేశారు. పొరపాటున కొన్ని ప్రైవేటు పట్టాభూముల సర్వే నంబర్లు సైతం ప్రొహిబిటెడ్‌గా నమోదయ్యాయి. కొన్ని సర్వేనంబర్లలోని భూములను ప్రభుత్వం కొంతమేరకు ప్రజా అవసరాలకు కొని.. రోడ్డు వేసినా, ప్రాజెక్టులు కట్టినా.. ఆ మొత్తం సర్వేనంబర్లను ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు.

అమ్ముకోలేక..కొనలేక..

నిషేధిత జాబితాలోని భూములను క్లియర్ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇందుకోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పట్టణాల్లో మున్సిపల్, గ్రామాల్లో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇస్తారు. ఆ నివేదిక ఆధారంగా తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ రిపోర్టు(ఎన్‌వోసీ)తో కలెక్టర్ ధరణిలో నమోదైన ప్రొహిబిటెడ్ జాబితా నుంచి ఆ సర్వే నంబర్‌కు మినహాయింపు ఇస్తారు. కానీ బాధితులు దరఖాస్తు చేసుకుంటే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చేందుకు నెలల సమయం తీసుకుంటున్నారు. ఒకవేళ ఇచ్చినా అది కలెక్టరేట్ నుంచి క్లియర్ అయ్యేందుకు తీవ్ర జాప్యమవుతుంది. దీంతో బాధితులు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుంది. కొందరి దరఖాస్తులు రిజెక్టు కాగా.. మళ్లీ మళ్లీ అప్లయ్ చేయడంతో డబ్బులు వృథా అవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ స్థలం కోసం నిలిపేశారు



మాకు సర్వేనంబరు 72లో మూడెకరాలు ఉంది. పక్కనే గల సర్వేనంబర్ 71లో మున్సిపల్‌కు చెందిన 15 గుంటల జీపీ లేఅవుట్ స్థలం ఉంది. దాని గురించి దాదాపు 11 ఎకరాల స్థలాన్ని నిషేధిత భూమిలో ఉంచడం ఎంతవరకు న్యాయం. నేను ఏళ్లుగా తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదు. మున్సిపల్ కమిషనర్ నుంచి ఎన్‌వోసీ పొందాను. కలెక్టర్ నా స్థలాన్ని నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలి.

– అన్నారం శ్రీనివాస్, సిరిసిల్ల

క్లియర్ చేస్తలేరు



ముష్టిపల్లి శివారులోని సర్వేనంబరు 36/సీలో నేను, మరొకరు కలిసి 20 గుంటల స్థలం తీసుకున్నాం. నిషేధిత సర్వేనంబర్ల జాబితాలో ఉన్న మరొకరి స్థలానికి అధికారులు రెండేళ్ల క్రితమే క్లియరెన్స్ ఇచ్చారు. అదే సర్వేనంబరు, అదే స్థలాన్ని కొనుగోలు చేసిన నాకు క్లియరెన్స్ ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. నిబంధనల ప్రకారమే నేను ధరణిలో దరఖాస్తు చేసుకోగా కలెక్టరేట్‌లో రిజెక్టు చేశారు.

– ఎలుక వెంకటేశం, సిరిసిల్ల

ఎప్పటికప్పుడే పరిష్కరిస్తున్నాం



మాకు వచ్చే ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడే పరిష్కరిస్తున్నాం. ఇప్పటికే చాలా వాటిని క్లియర్ చేశాం. 82 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని కోర్టు కేసులు, మరికొన్ని డిస్కషన్ చేసే ఫైల్స్ పెండింగ్‌లో ఉంటాయి. అలాంటి వాటిని పరిష్కరించే అవకాశం లేదు. అన్ని పరిశీలించి చేయాల్సి ఉంటుంది. మాకు వచ్చే ఫైల్స్ అన్ని ఒకటి, రెండు రోజుల్లోనే కలెక్టర్ పోర్టల్‌కు లాగిన్‌కు పంపిస్తున్నాం.

– రమేశ్ లోలెవార్, సిరిసిల్ల ఆర్డీవో

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి


మృతిచెందిన షఫీ

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్‌లో కూలీ పనుల కోసం మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సెంట్రింగ్ పనులు చేసుకునేందుకు మహారాష్ట్ర నుంచి వచ్చిన షేక్ షఫీ(38) కోరుట్లలోని హాజీపురాలో నివాసముంటున్నాడు. శనివారం ఉదయం ఓ పిల్లర్ కోసం తవ్విన గుంత నుంచి నీటిని కరెంటు మోటార్‌తో బయటకు తోడే పనిలో ఉండగా కాళ్లకు కరెంటు వైర్ తగిలి గుంతలోని నీటిలో పడింది. గుంతలో ఉన్న షేక్ షఫీ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని రంగంపల్లికి చెందిన ఆరెపల్లి జంపయ్య(33) శనివారం స్థానిక ఎల్లమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జంపయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతన్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. దీంతో మనస్థాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): పెర్కపల్లి గ్రామానికి చెందిన ఇటిక్యాల కనుకమ్మ(58) ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుందని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. కనుకమ్మ కుమారుడు రమేశ్ రెండేళ్లక్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స కోసం ఆమె కొంత అప్పుచేసింది. ఇటీవల ఆమె భర్త కొమురయ్య ప్రమాదవశాత్తు జారికింద పడగా ఆస్పత్రిలో చేర్పించారు. అతడి చికిత్స కోసం మరికొంత అప్పు చేయాల్సి వచ్చింది. కుటుంబపెద్దగా అప్పు తీర్చేదారి లేకపోవడం, కుటుంబ పోషణ భారం కావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన కనుకమ్మ శనివారం పురుగులమందు తాగింది. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. భర్త కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పాఠశాలలో చోరీ

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మామిడిపల్లిలోని ఉన్నత పాఠశాల దొంగతనం జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఈనెల 3న కంప్యూటర్ ఉన్న పాఠశాల గదికి తాళం వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.40వేల విలువైన కంప్యూటర్, మానిటర్, కీబోర్డు, సీపీయూ అపహరించుకుపోయారు. ప్రధానోపాధ్యాయుడు కస్తూరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడు మండలాల్లో భారీ వర్షం

సిరిసిల్ల: జిల్లాలోని మూడు మండలాల్లో శనివారం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలోని మిగతా పది మండలాల్లో తుంపర్లతో కూడిన వానలు పడ్డాయి. గంభీరావుపేటలో అత్యధికంగా 39.0 మిల్లీమీటర్ల వర్షం పడగా.. ముస్తాబాద్‌లో 38.9, వీర్నపల్లిలో 23.9, రుద్రంగిలో 5.1, చందుర్తిలో 6.2, వేములవాడ రూరల్‌లో 4.8, బోయినపల్లిలో 3.1, వేములవాడలో 2.0, సిరిసిల్లలో 0.9, కోనరావుపేటలో 2.6, ఎల్లారెడ్డిపేటలో 6.6, తంగళ్లపల్లిలో 4.2, ఇల్లంతకుంటలో 2.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

కన్న కొడుకును చూడకుండానే తల్లి కన్నుమూత

- వైద్యం వికటించి బాలింత మృతి
- వైద్యుల నిర్లక్ష్యంతోనేనని బంధువుల ఆందోళన


మృతురాలు రజిత (ఫైల్)


ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

వేములవాడఅర్బన్: నవమోసాలు మోసి.. ఎన్నో ఆశలతో కొడుకుని కన్నా...ఆ తల్లి కంటి చూపునకు కూడా నోచుకోకుండానే కన్నుమూసింది. కొడుకు పుట్టిన సంబరం లేకుండా ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వేములవాడ పట్టణానికి చెందిన పిల్లి రజిత(22) అనే బాలింత వైద్యం వికటించి మృతిచెందినట్లు బాధిత బంధువులు ఆదివారం తెలిపారు. బాధిత బంధువులు తెలిపిన వివరాలు. వేములవాడకు చెందిన పిల్లి రజితకు కొడుముంజకు చెందిన వినయ్‌తో ఏడాది క్రితం ప్రేమ వివాహమైంది. నిండు గర్భిణీగా ఉన్న రజితను గురువారం రాత్రి వేములవాడ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వెంటనే అదే రోజు రాత్రి అత్యవసర పరిస్థితులు ఉన్నాయని చెప్పిన వైద్యులు శస్త్రచికిత్స చేశారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం రక్తస్రావం అవుతుందని, రజిత ఇబ్బందిపడుతుందని ఆసుపత్రి వైద్యుల దృష్టికి తీసుకెళ్లగా.. వైద్యులు వేరే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో రజితను కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించగా వారు ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అడ్మిట్ చేసుకున్న అక్కడి వైద్యులు రక్తస్రావం కావడంతో మళ్లీ శస్త్రచికిత్స నిర్వహించగా.. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున రజిత మృతి చెందింది. ఆదివారం ఉదయం బాధిత కుటుంబీకులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యంతోనే రజిత మృతిచెందిందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. అప్పుడే పుట్టిన బిడ్డకు న్యాయం చేయాలని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, వేములవాడ ఎస్సై అంజయ్య, ట్రాఫిక్ ఎస్సై రాజు ఆస్పత్రికి చేరుకొని బందోబస్తు చేపట్టారు. అలాగే కొడుముంజలో అంత్యక్రియలు నిర్వహించే వరకు పోలీస్‌బందోబస్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యను వివరణ కోరగా.. రజిత గురువారం రాత్రి అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రిలో చేరిందని, అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లీబిడ్డలను రక్షించాలని ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ తర్వాత తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని, శుక్రవారం ఉదయం ఆమెకు బీపీ పెరిగి, ఫిట్స్ రావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. ఈక్రమంలో ఆమెను తరలించడంలో జాప్యమైందని, ఇందులో తమ పొరపాటు ఏమి లేదన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి రజిత మృతి చెందిందని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు కదారి రాములు పేర్కొన్నారు. వేములవాడ మండలం కొడుముంజలోని మృతురాలి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో గొప్పగా సేవలు అందుతున్నాయని ప్రచారం చేసినందునే ఆసుపత్రికి వచ్చిన రజిత నిండు ప్రాణాలను వైద్యులు నిర్లక్ష్యంతో తీశారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గల్ఫ్‌లో చిక్కుకున్న నా భర్తను విడిపించండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వేడుకోలు


ఎమ్మెల్యేను కోరుతున్న బాధితకుటుంబసభ్యులు

కోనరావుపేట(వేములవాడ): సౌదీ అరేబియాలో చిక్కుకున్న తన భర్తను విడిపించాలని కోరుతూ కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన మేర్గ అంజి భార్య వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేడుకుంది. కొలనూర్‌కు చెందిన మేర్గ దేవయ్య–మల్లవ్వ దంపతుల కుమారుడు మేర్గ అంజి ముంబైలోని బైకల్‌లోని ఆఫీస్‌లో రూ.లక్షన్నర చెల్లించి సౌదీ అరేబియా వెళ్లాడు. ఆరు నెలలుగా పనిచేయించుకుంటున్న యాజమాన్యం జీతమివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జీతమడిగితే కొడుతున్నారంటూ వీడియో ద్వారా తెలిపాడు. 'సాక్షి'లో ఇతని కథనం ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి క్షేమంగా ఇంటికి రప్పించాలని సౌదీలోని ఇండియన్ ఎంబసీకి లేఖ రాశారు. ఈ విషయమై అంజిని క్షేమంగా ఇంటికి రప్పించాలని కోరుతూ ఎమ్మెల్యేను తల్లిదండ్రులు మల్లవ్వ, దేవయ్య, భార్య సోని, కుమారులు ఆదివారం కలిసి విన్నవించారు. అంజిని క్షేమంగా ఇంటికి రప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు వీరవేణి తిరుపతియాదవ్, నూగూరి గణేశ్, మేర్గ చందు తదితరులు ఉన్నారు.

రెండున్నరేళ్లుగా డబ్బుల కోసం ఎదురుచూపులు

- భూమి రిజిస్ట్రేషన్ కోసం ఫీజు చెల్లింపు
- రిజిస్ట్రేషన్ కాకపోగా.. ఫీజు తిరిగిరాలే..
- అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోని వైనం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్



సిరిసిల్ల: ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి సిరిసిల్లలోని వాసవీనగర్‌కు చెందిన దుగ్గు రాజేందర్. కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో మారం నర్సయ్య అనే రైతు వద్ద 5.09 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి మీసేవ కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకుని తేదీ: 21.01.2022న రూ.1,30,584 రిజిస్ట్రేషన్ ఫీజును మీసేవ ద్వారా చెల్లించారు. కోనరావుపేట తహసీల్దార్ ఆ భూమి రిజిస్ట్రేషన్ చేయరాదంటూ.. ఎలాంటి కారణాలు చెప్పకుండానే తిరస్కరించినట్లు రాజేందర్ తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ తిరస్కరణపై కారణాలు చెప్పాలని కోరినా.. సదరు తహసీల్దార్ పట్టించుకోలేదని బాధితుడు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం చెల్లించిన డబ్బులు సంగతి ఏంటని ప్రశ్నిస్తే.. వారం రోజుల్లో మీ బ్యాంకు ఖాతాకు జమవుతాయని కోనరావుపేట తహసీల్దార్ సమాధానమిచ్చారని రాజేందర్ వివరించారు. ఆరు నెలలైనా ఆ డబ్బులు రాలేదని, దీనిపై కోనరావుపేట రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే.. కలెక్టర్‌కు పంపించామని చెప్పారని తెలిపారు. ఆ డబ్బులను సీసీఎల్‌ఏ హైదరాబాద్ వారు వాపస్ చేస్తారని ఇచ్చిన లేఖతో వారిని సంప్రదిస్తే ఆ డబ్బులు తమకు రాలేదని, ఐజీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ రీఫండ్ చేస్తుందని సీసీఎల్‌ఏ అధికారుల స్పష్టం చేసినట్లు వివరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను సంప్రదిస్తే జిల్లా కలెక్టర్‌కే అధికారం ఉందంటూ మరో లేఖ అందించారని రాజేందర్ వివరించారు. ఆ లేఖతో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌ను సంప్రదించానని.. కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్‌కు కలెక్టర్ లేఖ రాశారని పేర్కొన్నారు. ఆ డబ్బులు రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రెజరీ ఆఫీస్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయని, అక్కడికే వెళ్లాలంటూ.. జిల్లా రిజిస్ట్రార్ పేర్కొన్నారని రాజేందర్ వివరించారు. ఇలా రెండున్నరేళ్లుగా డబ్బులు వాపస్ ఇవ్వకుండా సతాయిస్తున్నారని బాధితుడు వాపోయారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఈ సమస్యపై ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను సంప్రదించగా.. డబ్బులు ఇవ్వాలని కోరుతూ జిల్లా ట్రెజరీ అధికారి(డీటీవో)కి లేఖ రాశారని రాజేందర్, కానీ సదరు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తనకు డబ్బులు వాపస్ ఇవ్వాలని, లేదా భూమి రిజిస్ట్రేషన్ చేయాలని రాజేందర్ కోరుతున్నారు. రెండున్నర ఏళ్లుగా ఆఫీస్‌ల చుట్టూ తిరగలేక విసిగిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం


వేములవాడ రాజన్న గుడి, ప్రధాన రహదారి

- నెరవేరనున్న వేములవాడవాసుల కల
- ఎట్టకేలకు నోటిఫికేషన్

వేములవాడ: వేములవాడ వాసుల ఏళ్ల నాటి కల నెరవేరనుంది. వేములవాడ పట్టణవాసులు, రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు దూరంకానున్నాయి. మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న గుడి వరకు గల రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో విస్తరణ పనులకు మోక్షం లభించింది. భూసేకరణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయింది. ఆమేరకు శనివారం తెలంగాణ ప్రభుత్వం, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం నుంచి భూసేకరణకు ప్రకటన విడుదలైంది.

ఆలయ పట్టణాభివృద్ధి

ఓ వైపు ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.50కోట్లు మంజూరుచేసిందని, ఇప్పుడు రోడ్డు విస్తరణ పనులకు ప్రకటన విడుదల కావడంతో ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంతోపాటు ఆలయం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

రాజన్న ఆలయానికి ఏటా భక్తుల రద్దీ పెరుగుతుంది. దానికి అనుగుణంగా పట్టణంలో రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో వాహనదారులు, భక్తులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు రోడ్ల విస్తరణకు భూసేకరణ పనుల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక ట్రాఫిక్ తిప్పలు తప్పనున్నాయన్న భావన వినిపిస్తుంది.

స్పష్టమైన ప్రణాళికతో ముందుకు

కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే వేములవాడ ఆలయంలో భక్తులకు బ్రేక్ దర్శనాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అలాగే భక్తుల ప్రీతిపాత్రమైన మొక్కు కోడె మొక్కుకు వినియోగించే కోడెల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోడెల సంరక్షణకు మూడు షెడ్లు ఏర్పాటు చేసి గోశాలలో సీసీ రోడ్ల నిర్మాణం, అలాగే డ్రెయినేజీ నిర్మాణానికి చేపట్టారు. గోవులకు పచ్చగడ్డి, దాణా అందిస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న కోడెలను అర్హులైన రైతులకు ఇప్పటికే ఉచితంగా అందజేశారు. అలాగే భక్తులకు తిరుమల తరహాలో నిత్యాన్నదానం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల ప్రకటించగా, దానికోసం ఆలయం సమీపంలోని శివార్చన స్టేజీ వద్ద సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులను ఇప్పటికే ఆదేశించారు. దానికోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

పాడిగేదెలపై పిచ్చి కుక్క దాడి

- కుక్కను హతమార్చిన గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. దాదాపు 10 పాడి గేదెలపై దాడిచేసింది. రెండు రోజుల్లో వరుసగా దాడి చేయడంతో గ్రామస్తులు ఆదివారం పిచ్చికుక్కను హతం చేశారు. ఇప్పటికే గ్రామంలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం కిషన్‌దాస్‌పేటకు చెందిన ముద్దం వెంకటికి చెందిన గేదెపై దాడి చేసింది. గ్రామస్తులు పిచ్చికుక్కను హతమార్చారు. గ్రామంలో కుక్కల బెడద పెరిగిపోయిందని, వాటి నుంచి కాపాడాలని ప్రత్యేకాధికారి సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌లను గ్రామస్తులు కోరారు.

కారు బైక్‌ఢీ.. దంపతులకు గాయాలు


గాయపడిన సంపత్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో శనివారం మోటర్‌సైకిల్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులకు తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సూర సంపత్ తన భార్య సరోజనతో కలిసి మోటర్‌సైకిల్‌పై కేశవపట్నం వెళ్తున్నాడు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సంపత్, సరోజనకు తీవ్రగాయాలు అయ్యాయి. మోటర్‌సైకిల్ నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఆపకుండా వెళ్లిపోయిన కారును నంబర్ ఆధారంగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

విచారణలో జాప్యంపై అనుమానాలు

- చందుర్తి సొసైటీలో భారీగా అక్రమాలు
- నెల రోజుల గడిచినా నిర్లక్ష్యం


విచారణ కోసం సిద్ధంగా ఉంచిన రికార్డులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలపై విచారణకు అధికారులు జాప్యమవుతుండడంపై రైతుల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయి. రైతులకు తెలియకుండానే వారి పేరిట పంట రుణాలు తీసుకోవడం సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. దీనిపై గత నెల 7వ తేదీన విచారణ చేపట్టిన జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణజ్యోతి రూ.32.34లక్షలు దారిపట్టించారని చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈవోపై కేసు నమోదైంది. అయితే సంఘంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

సమగ్ర విచారణతో బట్టబయలు

సొసైటీలో 2016 నుంచి 2024 వరకు జరిగిన లావాదేవీలపై సమగ్ర విచారణకు అధికారులను నియమించారు. అయినా వారు చర్యలకు దిగడం లేదు. పంట రుణాలే కాకుండా సహకార సంఘం వాటాధనాన్ని సైతం సిబ్బంది మింగేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎనిమిదేళ్లుగా జరిగిన లావాదేవీలపై పూర్తి విచారణ చేపడితే అన్ని విషయాలు వెలుగుచూస్తాయని చర్చ సాగుతోంది. ఏటా జరిగే ఆడిట్‌లో భాగంగా అధికారులు ఎలా క్లీన్‌చీట్ ఇచ్చారనే చర్చ నడుస్తుంది.

విచారణ జాప్యంతో అక్రమాల సర్దుబాటు

సహకార సంఘం అవినీతి బయటపడి నెల రోజులు గడుస్తున్నా విచారణ జాప్యం చేయడంతో సహ కార సంఘంలో పనిచేసే సిబ్బంది అక్రమాలను దిద్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ఎరువు బస్తాలను విక్రయించిన లాభాల సొమ్మును కూడా స్వాహా చేశారన్న ప్రచారం ఉంది. సహకార సంఘ అవినీతి, అక్రమాల్లో సీఈవోతోపాటు చైర్మన్‌పై సైతం ఆరోపణలు వస్తుండడం చర్చనీయాంశమైంది.

నేటి నుంచి విచారణ



సొసైటీ అక్రమాలపై చట్టం 51 ప్రకారం సమగ్ర విచారణ చేపట్టేందుకు సోమవారం నుంచి అధికారులు వస్తున్నారు. విచారణ చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అధికారుల విచారణ రెండు రోజులపాటు కొనసాగుతుంది.
– శ్రీవర్ధన్, ఇన్‌చార్జి సీఈవో, చందుర్తి

న్యాయం చేయండి


ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబీకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన దున్నపోతుల మల్లయ్య(52) మృతిపై కుటుంబీకులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జ్వరం వచ్చిందని చేరిన మల్లయ్యను వైద్యుడు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. జ్వరంతో బాధపడుతున్న మల్లయ్యకు వైద్యుడు సరైన వైద్యం అందించనందునే మృతిచెందాడని రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఎస్సై గణేశ్ ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని శాంతింపచేశారు. వైద్యుడు మాట్లాడుతూ మల్లయ్యకు ఫిట్స్ రావడంతోనే మృతిచెందాడని, ఎంఆర్‌ఐ స్కాన్‌లో ఈ విషయం స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. తమ నిర్లక్ష్యం ఎంత మాత్రం లేదని స్పష్టం చేశారు. మల్లయ్య మృతికి కారణమైన వైద్యునిపై చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు డిమాండ్ చేశారు.

విద్యార్థి ఉద్యమాలతోనే నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న అంగిడి కుమార్

సిరిసిల్ల: శాస్త్రీయ విద్యను సాధించేందుకు విప్లవ విద్యార్థి ఉద్యమాలను పోరాట స్ఫూర్తితో సాగించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం పీడీఎస్‌యూ 50 ఏళ్ల సదస్సును నిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూకు ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, దుస్సా చేరాలు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, మారోజు వీరన్న లాంటి ఎందరో వీరులు విద్యార్థుల హక్కులు, శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపన కోసం పోరాడుతూ అమరులయ్యారని గుర్తుచేశారు. 78 ఏళ్లుగా నాణ్యమైన విద్యను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ, పీడిత వర్గాలకు ఉచితంగా అందించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. పాలకులు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థి ఉద్యమాలు నిర్మించడమే పీడీఎస్‌యూ లక్ష్యమన్నారు. అక్టోబర్ 12, 13 తేదీలలో పీడీఎస్‌యూ 50 ఏళ్ల వేడుకలను నిర్వహిస్తుందని తెలిపారు. నాయకులు ఆంజనేయులు, రాకేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను గౌరవించాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాకారులు

వేములవాడఅర్బన్: ఉద్యమకారులను గౌరవించాలని పలువురు కళాకారులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్ర ఉద్యమ నాయకులు ఆదివారం వేములవాడకు రాగా.. వారికి కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఈనెల 27న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆరో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సన్మాన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాకారులకు గౌరవ వేతనం అందించాలన్నారు. ఈ సందర్భంగా రాజన్నను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాసరావు, సురేందర్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, బొజ్జ కనుకయ్య, వారాల దేవయ్య తదితరులు ఉన్నారు.

మూత్రపిండాల వ్యాధితో గీతకార్మికుని మృతి

- రూ.10లక్షలు ఖర్చు చేసిన దక్కని ప్రాణం
- ఎల్లారెడ్డిపేటలో విషాదం


శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు గంట శ్రీనివాస్‌గౌడ్ (44) మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ వినాయక చవితి రోజు మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కులవృత్తి కల్లు గీత పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించగా.. మూత్రపిండాలకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారణయ్యింది. దీంతో హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో వైద్యచికిత్సల కోసం రూ.10 లక్షలు వెచ్చించారు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. పరిస్థితి విషమించి శనివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పరామర్శించారు.



వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. షవర్ల వద్ద స్నానాలు చేసిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.